# సంస్కారం

కె.కె. రఘునందన



**మా** వారికి ఫ్రెండ్స్ సర్కిల్ ఎక్కువ. అందువల్ల మా ఇంటికి చాలామంది రాకపోకలు అధికం. ఆయన లేని సమయంలో ఎవరైనా వస్తే, వివరాలు రాసుకుని వచ్చాక చూపించేదాన్ని.

"గుంటూరు నుంచి వచ్చానని చెప్పమని ఈ అడ్రసు ఇచ్చాడు" అన్నాను ఒకరోజు ఇంటికి రాగానే కాగితం ఇస్తూ.

"అరే! నవీన్‌గాడా! నా క్లాస్‌మేట్. కాస్సేపు ఉండమనలేకపోయావా!" అని గింజుకుపోయారు.

వారిద్దరూ కలిసి విజయనగరంలో బి.ఇడి. చేశారుట. బాగా క్లోజ్ అన్న విషయం అతగాడి కోసం మా వారి నిరీక్షణలోనే అర్థమైపోయింది.

ఆ సాయంత్రానికి నవీన్ దర్శనమిచ్చేదాకా మా వారికి ముద్ద దిగలేదు.

అతన్ని నాకు పరిచయం చేశారు.

"ఈయనగారు తెగ కలవరించారనుకోండి, అన్నయ్యగారూ!" అన్నాను వరస కలిపి. "వీడికి గాబరా ఎక్కువ, చెల్లమ్మా! అన్నింటికీ ఆత్రమే." తిరిగి నన్ను సంబోధించేసరికి మహదానందం అనిపించింది.

అది మొదలు మా ఇంటికి నవీన్ రాకపోకలు అధికమైనాయి. వారు లేని సమయంలో వచ్చినా అతన్ని గౌరవించేదాన్ని. మా కుటుంబ సభ్యుడిలా కలిసిపోయాడు.

ఒకరోజు మధ్యాహ్నం నేను తలంటుకుంటున్నాను. కాలింగ్ బజర్ వినిపించింది. బట్ట కప్పుకుని కిటికీలోంచి చూశాను.

"ఓహో అన్నయ్యా, నువ్వా! రా, రా!" ఆదరంగా తలుపు తెరిచాను.

నవీన్ లోపలికి వచ్చి సోఫాలో చతికిలపడ్డాడు. నేను లోపలికి వెళ్లి టీ పెట్టి తెచ్చాను.

తిరిగి నేను వచ్చేసరికి, "అమ్మా! అమ్మా!" అంటూ బాధతో మూలుగు వినిపించింది.

నవీన్ సోఫాలో గిలగిల్లాడుతున్నాడు.

"అన్నయ్యా! అన్నయ్యా!" అంటూ ఆ బాధ చూడలేక గుండెలు రాశాను. "చెల్లమ్మా!" అంటూ అతని చేతులు నా వీపుమీదకి వెళ్లాయి.

పాపం, నొప్పి తట్టుకోలేక నా ఆసరా కోరాడేమో! కానీ నా కెందుకో ఆ స్పర్శలో కృతిమత్వం గోచరించింది. క్రమక్రమంగా బిగుస్తుంటే చికాకేసింది.

"ఏమైంది, అన్నయ్యా?" అయోమయం నాలో.

"అలాగే ఉండు, శ్రుతీ! నీ అందం చూసి తట్టుకోలేకపోతున్నాను."

అంతే, నే నొక దుర్గాదేవిని అయ్యాను.

"ఛ! ఛండాలుడా!"

"మిత్రుడికి అనుమానం రాకుండా చెల్లెలని వరుస కలిపాను."

"రాస్కెల్! పోతావా, లేదా!" సీసాతో బెదిరించాను.

"ఈ విషయం మా వాడితో చెప్పావో, ప్లేటు ఫిరాయించగలను." వెనక్కి తగ్గుతూ పోయాడు త్రాష్టుడు.

మా వారికి చెప్పకుండా దాచటం కూడా అంతరాత్మను మోసం చేస్తున్నట్లే అనిపించింది.

ఇది జరిగాక ఒకరోజు కొత్తగా కడుతున్న మా ఇంటి వైపు వెళ్లాను. మొత్తం నలుగురు మేస్త్రీలు, ముగ్గురు ఆడవాళ్లు పని చేస్తున్నారు.

ఆ మగవాళ్లని ఆడవాళ్లు "అన్నయ్యా!" అని పిలవటం, వాళ్లంతా "చెల్లెమ్మా" అనటం నేను గమనించాను.

అయితే నా కా విషయమై రెండు సందేహాలు కలిగాయి. నన్ను చూసి వాళ్లు అలా పిలిచుకుంటున్నారా, లేక నవీన్‌లాంటి వెధవలేనా వీళ్లూ అని.

"ఏయ్! నిన్నే, ఇలా రా!" పనయ్యాక ఒక అమ్మాయిని పిలిచాను.

"మీరు ఒకే ఇంట్లో మనుషులా?" అడిగాను.

"లేదండీ, వేరు వేరు ఊళ్లనుంచి వస్తూంటాం.' ' చెప్పింది.

"మరి అన్నయ్యా అని పిలిస్తున్నారే?"

"ఓ అదా! మరి మగ, ఆడ కలిసి పని చేస్తున్నాం కదమ్మా! ఎవరి కే బుద్ధులు వంకరవుతాయో నన్న భయంతో మేమే వాళ్లని అన్నయ్యలని అనేస్తాం. వాళ్లు కూడా మమ్మల్ని సొంత అప్పచెల్లెల్లా చూసుకుంటారు. లేకపోతే గుమ్మం దాటితే మాకు రచ్చ నేదమ్మా?"

ఒక్కసారి బొమ్మనయ్యాను.

ఈ సంస్కారం వీ ళ్లే చదువులు చదివి సంపాదించారు?

●